ప్రజాశక్తి

శుక్రవారం 5 జులై 2024



టిడిపి నేతల వేధింపులు

ఎండిఎం నిర్వాహకురాలి ఆత్మహత్యాయత్నం

వజ్రకరూరు : 23 ఏళ్లుగా ఎలాంటి ఆరోపణలు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీని వదిలేయాలంటూ ఇటీవల కొందరు టిడిపి నాయకులు బెదిరించడంతో మనస్తాపానికి లోనై మధ్యాహ్న భోజన కార్మికురాలు ఆత్మహత్యకు యత్నించింది. పాఠశాల ఆవరణంలోనే పురుగుల మందు తాగింది. ఇందుకు సంబంధించి బాధితురాలు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం చాయాపురం గ్రామానికి చెందిన సుంకమ్మ గత 23 ఏళ్లుగా గ్రామ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా ఉంటూ పిల్లలకు భోజనం అందిస్తోంది. ఇటీవల టిడిపి అధికారంలోకి రావడంతో భోజన ఏజెన్సీని వదిలేయాలంటూ గ్రామానికి చెందిన కొందరు టిడిపి నాయకులు ఆమెను బెదిరించారు. తాను ఎలాంటి వివాదాల్లో లేనని, తన జీవనాధారం దూరం చేయొద్దంటూ ఆమె ప్రాధేయపడింది. అయినా ఏజెన్సీని వదులుకోవాలంటూ టిడిపి నాయకులు బెదిరించారు. ఇదే విషయంపై గురువారం ఉదయం పాఠశాల ఆవరణలో వివాదం చెలరేగింది. దీంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ గదిలోనే సుంకమ్మ పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టిడిపి నాయకులపై చర్యలు తీసుకోండి : సిపిఎం

చాయపురం గ్రామంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలిని బెదిరింపులకు గురి చేసి, ఆమె ఆత్మహత్యాయత్నంకు కారణం అయిన టిడిపి నేతలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి విరూపాక్షి, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సిఐటి డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నంకు పాల్పడి గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. మధ్యాహ్న భోజనం పథకం ఏర్పాటుచేసిన 2003 సంవత్సరం నుంచి ఎలాంటి ఆరోపణలు లేకుండా ఏజెన్సీని నిర్వహిస్తోందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఏజెన్సీ నిర్వహణ బాధ్యతను తమకు ఇవ్వాలంటూ టిడిపి నేతలు బెదిరింపులకు పాల్పడడంతో ఆమె ఆత్మహత్యకు యత్నించిందన్నారు. బెదిరింపులకు పాల్పడిన వారిపై పోలీసు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీని ఆమెకే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు జయ రమాదేవి, ఎండిఎం జిల్లా అధ్యక్షులు జయమ్మ, ఉపాధ్యక్షులు రంగమ్మ, కౌలు రైతు సంఘం అధ్యక్షులు రంగారెడ్డి పాల్గొన్నారు.

అధికారం మాది..మీరు తప్పుకోండి..!

- స్కీమ్ వర్కర్లపై రాజకీయ ఒత్తిళ్లు
- కొన్ని చోట్ల అమ్మకానికి పోస్టులు
- మీరు తప్పుకుంటే.. మావాళ్లకిస్తాం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికారం మారింది... ఇక మీరు తప్పుకుంటే... మావాళ్లకివ్వాలి అంటూ అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు స్కీమ్ వర్కర్లపై పెరుగుతున్నాయి. మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు, కొన్ని చోట్ల ఆశా వర్కర్లు, రేషన్ డీలర్లపై ఈ రకమైన ఒత్తిళ్లు అధికమయ్యాయి. పాత వారిని తప్పించి కొత్తవారికి ఈ పోస్టులు కట్టబెట్టేందుకు అధికార టిడిపి నాయకులు క్షేత్ర స్థాయిలో ఈ పథకాల్లో పనిచేస్తున్న పాత వారిపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారన్న ఆరోపణలు. కొన్ని చోట్ల ఖాళీ అయిన పోస్టులకు ధరలు కూడా నిర్ణయించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ పథకాల కింద పనిచేస్తున్న సిబ్బంది ఉన్నారు. ఉపాధి పథకం అమల్లో క్షేత్ర స్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్ కీలకం. గ్రామ పంచాయతీకి ఒకరుచొప్పున ఉన్నారు. ఈ రకంగా అనంతపురం జిల్లాలో 500 మందికిపైగా ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. ఇందులో కొంత మంది దశబ్దకాలంగానూ పనిచేస్తున్న వారు ఉండగా, కొంతమంది గత ప్రభుత్వ హయంలో పాత వారిని తప్పించి కొత్తగా నియమించుకున్నవి ఉన్నాయి. ఇప్పుడు ఈ రకంగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను రాజీనామాలు చేయాలని ఒత్తిడి పెంచుతున్నారు. ఇక పాఠశాలల్లో మధ్యాహ్నం విద్యార్థులకు ఏర్పాటు చేసేందుకున్న భోజన ఏజెన్సీలపైనా ఈ రకమైన ఒత్తిళ్లే ఉంటున్నాయి. జిల్లాలో సుమారు 1620 మధ్యాహ్న భోజన ఏజెన్సీలు నడుస్తున్నాయి. ఇప్పుడు వీరిపైనా ఇదే రకమైన ఒత్తిళ్లు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే గురువారం నాడు వజ్రకరువూరు మండలంలోని ఛాయపురం గ్రామంలో ఏజెన్సీ నిర్వాహకురాలు ఒకరు ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశమైంది. ఇకపోతే యానిమేటర్ల పరిస్థితి ఇదే రకంగా ఉంది. జిల్లాలో వెయ్యి మంది వరకు యానిమేటర్లు పనిచేస్తున్నారు. మహిళా సంఘాల నిర్వహణంలో కీలకంగా పనిచేసే వీరిని తప్పిస్తున్నారు. రేషన్ దుకాణాల సంగతి వేరే చెప్పనక్కర్లేదు. ఎన్నికల ఫలితాలొచ్చిన రోజు నుంచిఎవరికి రేషన్ దుకాణాలివ్వాలన్నది అధికార టిడిపిలో చర్చ నడుస్తోంది. ఈ పోస్టుల కోసం ఆ పార్టీ నేతలు ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద పెద్దఎత్తున చేరుకుని అడుగుతున్నారు. ఒక్క పోస్టుకు సగటున ఐదారుగురు వస్తుండటంతో ఈ పంపిణీ ఎలా చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

కొన్ని చోట్ల ప్రతి దానికీ ఒక రేటు ?

ఇప్పుడున్న పాతవారిని తప్పించి కొత్తవారిని నియమించే విషయంలోనూ కొన్ని చోట్ల ధరలు నిర్ణయించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో దానికి ఒక్కో రకమైన ధర నిర్ణయించడం చర్చనీయాంశం అయింది. అన్నింటిలోకి అధిక ధర పలుకుతున్నది ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కావడం గమనార్హం. ఈ పోస్టు కావాలనుకునే వారు రూ.10 లక్షలకుపైగా ధర నిర్ణయించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక యానిమేటర్లుకు రూ.30 వేలు, రేషన్ దుకాణానికి రూ.50 వేలు ఇలా అనేక పోస్టులకు కొన్ని నియోజకవర్గాల్లో ధరలు నిర్ణయించినట్టు ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల మాత్రం ఎన్నికల్లో పనిచేసిన వారికిచ్చేందుకు సిద్ధపడుతున్నారు. ఈ రకంగా పాతవారిని తప్పించి కొత్తవారికి అవకాశం కల్పించే పేరుతో ఒత్తిళ్లు వస్తుండటం గమనార్హం.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుంకమ్మను పరామర్శిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

చిరుద్యోగులపై టిడిపి వేధింపులు ఆపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం చిరు ఉద్యోగులపై వేధింపులకు పాల్పడడం సరికాదని, ఇలాంటి చర్యలను ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఇటీవల జిల్లాలో చిరుద్యోగులు, కార్మికులపై చోటు చేసుకున్న సంఘటనలు దాడులపై గురువారం ఆయన ఓ ప్రకటనలో ఖండించారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం చేసిన తప్పులను ఈ ప్రభుత్వం కూడా చేస్తే తేడా ఏముంటుందన్నారు. మధ్యాహ్నం భోజనం, ఆశ, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు, శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకం కార్మికులను రాజీనామా చేయమని మండలాల్లో అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తెస్తుండటం దారుణంగా ఉందన్నారు. వజ్రకరూరు మండలం చాయపురం గ్రామంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు సుంకమ్మ స్థానిక టీడీపీ నాయకుల వేధింపులతో నేడు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ రకమైన వేధింపులు పెరుగుతున్నాయని, వీటిని నివారించాలని ఎమ్మెల్యేలకు, అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. విడపనకల్లు మండలం జనార్దన పల్లి గ్రామంలో ఆశా కార్యకర్త నాగమణిని విధులకు రావొద్దని, బెలుగుప్ప మండల కేంద్రంలో ఆశా కార్మికురాలు సరస్వతిని రాజీనామా చేయాలని టిడిపి నాయకులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. మధ్యాహ్నం భోజనం ఏజెన్సీలను తమకు అప్పగించాలని బెలుగుప్ప మండలం గంగవరం, ఆత్మకూరు మండలంలో సనప, యాలేరు, సిద్దారాంపురం, ముట్టాల, ఆత్మకూరు సౌత్, నార్త్ స్కూల్స్, బొమ్మనహాల్ మండలం ఉద్దేహల్, గోవిందవాడ జిల్లా పరిషత్ స్కూల్స్ , సింగనమల మండలం తరిమెల, తాడిపత్రి మండలం వంగనూరు, గార్లదిన్నె మండలం కొప్పలకొండ గ్రామాల్లో బెదిరింపులు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. తాడిపత్రి మున్సిపాలిటీలో ఇస్మాయిల్ అనే కార్మికులు పని నుంచి నిలిపివేయడం మరికొద్ది మందిని ఇళ్లకు పిలిపించి బెదిరించడం జరుగుతోందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికుల ఆందోళనలకు మద్దతు ఇచ్చిన వారే ఈ రకంగా కార్మికులను వేధింపులు గురిచేయడం తగదన్నారు. చిరుద్యోగులపై గ్రామ మండల స్థాయిలో అధికార పార్టీ నాయకుల వేధింపులను ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రులు, అధికారులు తక్షణం జోక్యం చేసుకొని నివారించాలని రాంభూపాల్ కోరారు.

విద్యాసంస్థల

బంద్ విజయవంతం



అనంతపురంలో విద్యా సంస్థలను బంద్ చేయిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు



రాయదుర్గంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేస్తునన పోలీసులు

నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజ్‌కు కేంద్ర బిందువు అయిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని, అందుకు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ ఉమ్మడి అనంతపురం జిల్లాలో విజయవంతం అయ్యింది. ఎన్‌టిఎ పనితీరు, నీట్, నెట్ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలన బంద్ చేయించారు. స్వచ్ఛందంగా ప్రయివేటు విద్యా సంస్థలను మూసి వేసి బంద్‌కు సహకరించారు. అనంతపురం జిల్లా

రాయదుర్గంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

వార్త 6లో

కొండను తవ్వి ఎలుకను పట్టారు..

తూతూమంత్రంగా 'ఉపాధి' ప్రజావేదిక

ప్రజాశక్తి-శింగనమల



ప్రజావేదికలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

సామాజిక తనిఖీ బృందం మండలంలో సామాజిక తనిఖీ నిర్వహించి 'కొండను తవ్వి ఎలుక'ను పట్టిన చందంగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తాయి. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉదయం 10:30కు ప్రారంభమైన ప్రజావేదిక కార్యక్రమం మధ్యాహ్నం 1.30 వరకూ సాగింది. సమావేశంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అధికారులు కూడా నామమాత్రంగా హాజరయ్యారు. అనంతరం అధికారులు కేవలం నివేదికలను చదివి వినిపించి మమ అనిపించారు. మండల వ్యాప్తంగా గ్రామాల వారీగా ఉపాధి కూలీలు చేసిన పనులకు రికవరీ రూ.74,500, అపరాధ రుసుం రూ.36,000 రికవరీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిపిఒ రమణారెడ్డి, జిల్లా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, మధుసూదన్, ఎంపిడిఒ రమణ, ఎంపిపి యోగేశ్వరి, ఎపిఒ శ్రీదేవి, సర్పంచి నాగమణిమ్మ, ఎస్ఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి జడ్పిటిసి



జడ్పిటిసి ప్రభావతమ్మను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బ్రహ్మసముద్రం జడ్పిటిసి ప్రభావతమ్మ అన్నారు. ప్రభావతమ్మ గురువారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఎమ్మెల్యే అమిలినేని సరేంద్రబాబు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి ప్రభావతమ్మ మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఆఖరికి నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ గుర్తించి సీనియర్ నాయకుడు చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి అని భావించి టిడిపిలో చేరినట్లు వివరించారు.

సిపిఎం సభ్యుడు షేక్ ఖాదర్‌నబీ మృతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సిపిఎం నగర కమిటీ శాఖ సభ్యుడు షేక్ ఖాదర్ నబీ బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మృతిపై సిపిఎం జిల్లా కమిటీ నేతలు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈమేరకు గురువారం రాజీవ్ కాలనీ పంచాయతీ, మహదేవ నగర్‌లో ఉన్న షేక్ ఖాదర్‌నబీ మృతదేహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, ఇతర సభ్యులు నివాళులర్పించారు. అనంతరం నబీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 15ఏళ్ల నుంచి పార్టీ సభ్యునిగా చురుగ్గా పలు పోరాటాల్లో పాల్గొని తనదైన సేవలు అందించారని కొనియాడారు. హఠాత్ మరణం పొందడం బాధాకరం అన్నారు. ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వలి, ప్రకాష్‌రెడ్డి, వెంకటనారాయణ, వెంకటేష్, ఇస్మాయిల్, ఉపసర్పంచ్ మసూద్ వలి, డేవిడ్, ఎస్కే మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గూగూడులో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు ముమ్మరం

ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి-నార్పల



కుళ్లాయిస్వామి కోనేరును శుభ్రం చేయిస్తున్న అధికారులు

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలిసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. ఈనెల 7వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గ్రామంలో పర్యటించి ఏర్పాట్లను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కోనేరును శుభ్రం చేయడంతోపాటు పారిశుధ్య పనులు చేపట్టారు. ఎక్కడికక్కడ చేతి పంపులకు మరమ్మతులు చేశారు. అంతేగాకుండా భక్తుల సౌకర్యార్థం ఉత్సవాలు ముగిసేంత వరకూ ప్రత్యేకంగా నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచుతున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా సిఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి గ్రామాన్ని సందర్శించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.



అల్లూరి సీతారామరాజుకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అల్లూరి పోరాటం స్ఫూర్తినీయం

కలెక్టర్ వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వాతంత్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాత్ర స్ఫూర్తినీయం అని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలిపారు. గురువారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అల్లూరి సీతారామరాజు 127వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య మహా సంగ్రామంలో మహోజ్వల శక్తిగా సీతారామరాజు వెలుగొందారని తెలిపారు. గిరిజన ప్రజలను ప్రజలను పోరాటానికి సమాయత్తం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆ రోజుల్లో ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగాతలకు దోపిడీలకు అన్యాయాలకు గురయ్యేవారన్నారు. వారి శ్రమ దోపిడీ, ఆస్తుల దోపిడీ, స్త్రీల మానవహరణం జరుగుతుండేవని, ఇవన్నీ గమనించిన సీతారామరాజు మన్యం వాసుల కష్టాల నుంచి విముక్తి కలిగించడానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటం చేశారన్నారు. గిరిజనుల అభ్యున్నతికి పాటుపడిన అల్లూరి సీతారామరాజు 27 ఏళ్ల వయసులోనే అమరడయ్యారన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఆయన తెగువ ఎప్పటికీ మరువలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘా స్వరూప్, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, డిటిడబ్ల్యూఒ రామాంజనేయులు, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, డిపిఒ ప్రభాకర్ రావు, హార్టికల్చర్ డిడి ఫిరోజ్ ఖాన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవినీతి కం(పు)పోస్ట్ యార్డు..!

- కార్పొరేషన్ అధికారుల సమావేశంలో వాడీవేడి చర్చ
- ఎమ్మెల్యే ఎదుట మేయర్, డిప్యూటీ మేయర్ వాదనలు
- అక్రమాలు జరిగాయి : డిప్యూటీ మేయర్
- నిబంధనల మేరకే ప్రక్రియ : మేయర్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

పజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ కంపోస్ట్ యార్డులో అవినీతి జరిగిదంటూ కౌన్సిల్ సమావేశంలో వాదోపవాదాలు జరిగాయి. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సమక్షంలోనే మేయర్, డిప్యూటీ మేయర్ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. వైసిపికి చెందిన ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతో ఆ పార్టీలో అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. గురువారం ఉదయం కార్పొరేషన్ కారాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని గుత్తి రోడ్డులో ఉన్న కంపోస్టు యార్డులో బయో మైనింగ్‌పై వాడీవేడి చర్చ జరిగింది. ఈ కాంట్రాక్ట్ చేజిక్కించుకున్న నోవాసిటీ పనులు పూర్తి చేయకుండానే అర్థాంతరంగా వెళ్లిపోయిందని, ఇందులో భారీగా అవినీతి జరిగిదంటూ పాలకవర్గంకు చెందిన డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇదే సమయంలో మేయర్ మహమ్మద్ వసీం అడ్డుకుని తన వాదనను విన్పించారు. కంపోస్ట్‌యార్డ్‌లో బయో మైనింగ్ జరపటానికి నిర్వహించిన టెండర్లలో రూ.26 కోట్లకు గాను లెస్ రేట్లతో రూ.23 కోట్లకు నోవాసిటీ దక్కించుకుందన్నారు. ఇప్పటివరకు రూ.9 కోట్ల బిల్లులు మాత్రమే ఇచ్చామన్నారు. రూ.2 కోట్ల బిల్లులు ప్రాసెసింగ్‌లో ఉన్నాయన్నారు. బయో మైనింగ్ ప్రాసెస్‌లో అవినీతి జరిగిందంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని మేయర్ చెప్పుకొచ్చారు. డిప్యూటీ మేయర్ స్పందిస్తూ రోజుకు 1000 టన్నుల మెట్రిక్ టన్నుల చెత్తాచెదారాలను నిర్మూలన ప్రకారం ఏడాది కాలంలో 3.26 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ చేస్తామని అగ్రిమెంట్‌లో ఉండగా ఆ కంపెనీ అలా చేయలేదన్నారు. 180 రోజుల కాలానికి కేవలం 77 రోజులు మాత్రమే పని చేశారన్నారు. లక్షన్నర మెట్రిక్ టన్నుల వ్యర్థాలను వదిలేసి, అర్థాంతరంగా పనులు వదిలిపెట్టి వెళ్లారన్నారు. దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందన్నారు. ఈ అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ వాదనలను విన్న ఎమ్మెల్యే బయోమైనింగ్‌లో అక్రమాలపై కమిటీ వేయాలని కలెక్టర్‌ను కోరుతామని తెలియజేశారు. కంపోస్ట్ యార్డులో అవినీతి జరిగిందన్న అంశంపై బయట కూడా విమర్శలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో దానిపై విచారణ జరిపించాల్సి ఉందని ఎమ్మెల్యే అభిప్రాయ పడ్డారు.

ఎమ్మెల్యేకు అధికారుల ఘన స్వాగతం

ఎమ్మెల్యేగా ఎన్నికైన దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గురువారం తొలిసారిగా కార్పొరేషన్ కార్యాలయంకు రావడంతో మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో గజమాలతో సన్మానించారు. అన్ని విభాగాలకు చెందిన మినిస్టీరియల్ ఉద్యోగులు పుష్పగుచ్చాలు అందజేసి వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే కార్యాలయంకు వచ్చిన సందర్భంగా అధికారుల హడావుడి కన్పించింది. ఎమ్మెల్యేను కార్పొరేషన్ కార్యాలయానికి రమ్మని ఆహ్వానిస్తూ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సూర్యనారాయణ ఆహ్వానించారు. కమిషనర్ మేఘు స్వరూప్ ఆహ్వానించకపోవడంతో ఎమ్మెల్యే కార్యాలయంకు రాకుండా ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత కమిషనర్ మేఘు స్వరూప్ తనను ఆహ్వానించేందుకు వచ్చారని సమాచారం వెళ్లడంతో తిరిగి ఎమ్మెల్యే కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చారు. కాగా కమిషనర్ మేఘు స్వరూప్ పరిచయ కార్యక్రమం ముగిసిన తర్వాత సమావేశం నుంచి వెళ్లిపోయారు. సమస్యలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న సమావేశంలో కమిషనర్ ఉండకుండా వెళ్లిపోవడంపై విస్మయానికి గురి చేస్తోంది.

నగర ప్రజలకు రక్షిత నీరు సరఫరా చేయాలి

మేయర్ వసీంకు సిపిఎం వినతి



మేయర్ వసీంకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగర ప్రజలకు సురక్షిత నీరు సరఫరా చేసి ప్రజలను రోగాల నుంచి కాపాడాలని సిపిఎం నాయకులు కోరారు. ఈమేరకు సిపిఎం 1వ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నగర పాలకసంస్థ కార్యాలయంలో మేయర్ వసీంకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సిపిఎం 1వ నగర్ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ అనంతపురంలో సరఫరా అవుతున్న మంచినీరు పైప్‌లైన్ లీకై మురికి కాలవల నీరు కలిసి కలుషితం అవుతోందన్నారు. ఈ నీరు తాగుతున్న నగర ప్రజలకు వాంతులు, విరేచనాలు అవుతున్నాయన్నారు. దీన్ని అరికట్టడంలో మున్సిపల్ అధికారులు చొరవ చూపడం లేదని విమర్శించారు. కలుషితమైన నీటిని కనీసం పరీక్షలు చేసిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆఖరికి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు ఎక్కడ మంచినీరు కలుషితం అవుతుందో కనిపెట్టలేక పోతున్నారన్నారు. అలాగే మున్సిపల్ అధికారులు డయేరియాపై కూడా అవగాహన కల్పించడం లేదనానరు. ముద్దలాపురం దగ్గర ఉన్న స్టోరేజ్ ట్యాంకును శుభ్రం చేయక చాలా రోజులు అవుతోందన్నారు. ఈ విషయాలపై పత్రికల్లో కథనాలు తస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇదుకు మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి స్పందిస్తూ తక్షణమే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్కడైనా పైపులు లీకై నీరు కలుషితం అవుతుంటే బాగు చేయిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సిపిఎం 1వ నగర కార్యదర్శి రామిరెడ్డి, నగర నాయకులు వెంకటనారాయణ, బాలకృష్ణ, మసూద్, వెంకటేశు, నూరుల్లా, ఆటో యూనియన్ శివ, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులపై దాడి అమానుషం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

గడిచిన ఎన్నికల్లో టిడిపికి ఓటు వేయలేదన్న నెపంతో కొన్నేళ్లుగా పని చేస్తున్న మధ్యాహ్నం భోజనం పథకం కార్మికురాలు సుంకులమ్మ, కుటుంబ సభ్యులపై దాడి చేసిన టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వజ్రకరూరు మండలంలోని ఛాయాపురం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం నుంచి పని చేస్తున్న సుంకమ్మతోపాటు కుమార్తె రాధా, మనవడు దొరబాబు, మనవరాలు లక్ష్మి, స్వీపర్ మహేశ్వరిపై టిడిపి నాయకులు బెల్లం రమేష్,నాగభూషణం, పెద్దక్క దాడి చేయడం అమానుషమన్నారు. దీంతో సుంకమ్మ వేధింపులు తట్టుకోలేక మిరప పంటకు ఉపయోగించే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిందన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, పట్టణ కమిటీ సభ్యులు సురేంద్రబాబు, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

హాస్టళ్లను తనిఖీ చేసిన ఆర్డీవో



పైకప్పును పరిశీలిస్తున్న ఆర్డీటీ శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్లను గుంతకల్లు రెవిన్యూ డివిజినల్ అధికారి శ్రీనివాసులురెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'సమస్యల వలయంలో వసతి గృహం' అనే శీర్షికను గురువారం ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఆర్డీఓ గుత్తిలోని కోటలో ఉన్న బీసీ బాలుర హాస్టల్ ను తనిఖీ చేశారు. హాస్టల్లోని మరుగుదొడ్లు, విద్యార్థుల గదులు, కిటికీలు, గది పైకప్పు. పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా హాస్టల్లో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటికి కాంట్రాక్టర్ల శుభాకాంక్షలు

అనంతపురం : అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గురువారం నగరపాలక సంస్థకు మొదటిసారి వచ్చిన సందర్భంగా కాంట్రాక్టర్లు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపిన వారిలో కొగటం వేణుగోపాల్‌రెడ్డి, నులక వెంకటేష్, కాళహస్తి శ్రీనివాసులు, మురళీరెడ్డి, వై.లక్ష్మీనారాయణ, రామకృష్ణ, హరిక్రిష్ణ, వై.బి.షఫీ, హాబీబ్ పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ సెంటర్ తనిఖీ

అనంతపురం : స్థానిక జెఎన్‌టియులో గురువారం ఏర్పాటు చేసిన ఎపి.ఈఏపీసెట్-2024 హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఎస్‌వి.సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా హెల్ప్‌లైన్ సెంటర్‌లో విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు, సౌకర్యాలు, హెల్ప్‌లైన ప్రక్రియ ఏ విధంగా జరుగుతోందనే విషయాలను వర్శిటీ అడ్మిషన్ ఆర్.కిరణ్మయిను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జివి.సుబ్బారెడ్డి, పిఆర్ఓ ఎం.రామశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన 'దండు'

శింగనమల : ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మతోపాటు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పరిటాల శ్రీరామ్‌ను అనంతపురంలోని వారి స్వగృహంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, బండి పరశురాం, బెస్త నారాయణస్వామి, మహమ్మద్‌గౌస్, ప్రకాష్‌రాయల్, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని జూటూరు గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ కవిత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు సేవ చేయాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాతావరణాన్ని కాలుష్యాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలవను కలిసిన వైసిపి పాలకమండలి సభ్యులు

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘానికి చెందిన పాలకమండలి ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్‌తోపాటు 15 మంది వార్డు సభ్యులు గురువారం స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి తాము అన్నివిధాలా సహకరిస్తామని తెలిపారు. కాగా వైసిపికి 16 మంది సభ్యులు ఎమ్మెల్యేను కలవడం చర్చనీయాంశంగా మారింది. కాగా శనివారం రాయదుర్గం పురపాలక మండలి సాధారణ సమావేశంలో జరగనున్న నేపథ్యంలో సగం మంది పాలక మండలి సభ్యులు ఎమ్మెల్యేను కలవడం చర్చనీయాంశంగా మారింది.

రైతు బిడ్డలకు ఉచిత ట్యూషన్లు

వజ్రకరూరు : అభయ, జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉరవకొండ నియోజకవర్గంలోని రైతు బిడ్డలకు సాయంకాలం సమయంలో ఉచిత ట్యూషన్స్ (ఆస్క్ కేంద్రాలు) ఏర్పాటు చేస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా పని చేఉస్తున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గంలోని రైతు బిడ్డలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్..80747 80746, 62813 97630 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పింగళి వెంకయ్యకు నివాళి

నార్పల : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతిని పురస్కరించుకుని గురువారం మండల పరిధిలోని సిద్దరాచెర్ల గ్రామపంచాయతీ సచివాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సాకే రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సాకే కుళ్లాయప్ప, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మహేష్‌నాయుడు, ఏఎన్ఎం ఫరీదా భాను, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

కళ్యాణదుర్గం : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. గురువారం దేవీరమ్మ కాలనీకి బసవేశ్వర నగర్‌గా నామకరణం చేశారు. ముందుగా బసవేశ్వరుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదే కృతజ్ఞతతో ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు ఈ ప్రాంత అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, వీర లింగాయత్ నాయకులు ఆర్టీసీ శంకర్, కరణం రాము, తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నీట్ పరీక్షను రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతంగా ముగిసింది. ఇందులో భాగంగా గురువారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నాయకులు కలియతిరిగి బంద్ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నిట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్ట్రాలు నీట్ పరీక్షను రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాయన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం నీట్ పరీక్షపై ఏమాత్రం స్పందించలేదన్నారు. తక్షణమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నీట్ పరీక్ష రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేస్తూ నీట్ పరీక్ష నిర్వహించిన ఎన్టీఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనుమల నరేష్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు వేమన, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, పిఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ ఆలాం, వివిఎస్ఐవి రాష్ట్ర కార్యదర్శి వినోద్‌కుమార్, ఏపీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాయికుమార్, ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు రమణయ్య, ప్రతిభా భారతి, మంజునాథ్, ఉమా మహేష్, వంశీ, హరిక్రిష్ణ సోము, నాని ఓబులేష్, బాలకృష్ణ, పవన్, రారాజు, హరికష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : నీట్ పరీక్ష లీకేజీకి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి విద్యార్థులు, తల్లిదండ్రులకు బహిరంగ క్షమాపణ చెప్పడంతోపాటు అక్రమాలకు కారణమైన ఎన్‌టిఎను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు దేశవ్యాప్త బంద్‌లో భాగంగా గురువారం రాయదుర్గంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు బంద్ చేయించారు. పాఠశాలలను బంద్ చేయిస్తున్న విద్యార్థి సంఘం నాయకులను పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఎన్‌టిఎ లాంటి సంస్థలు నీట్ పరీక్షను అప్పజెప్పిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీట్ పరీక్షను రాసి నష్టపోయిన విద్యార్థులను ఆదుకోవాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, ఎన్ఎస్‌యుఐ జిల్లా నాయకులు అనిల్, విద్యార్థి సంఘం నాయకులు గౌతమ్, అరవింద్, మాధవ్, దినకర్, జీవన్, అనిల్, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పామిడి : నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాల ఎరుకల ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సాకే గోవిందు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పట్టణంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీకి కారణమైన ఎన్టీఏ సంస్థను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, బాబయ్య, నక్కల రామాంజనేయులు, రామాంజి, హసేన్, ఫక్రు, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : విద్యార్థి సంఘాల పిలుపుమేరకు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో బంద్ విజయవంతమైంది. ఇందులో భాగంగా విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలలను బంద్ చేయించి విద్యార్థులను ఇళ్లకు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే నీట్ పరీక్షను రద్దు చేసి పేపర్ లీకేజీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వజ్రకరూరు : దేశవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్ ఉరవకొండలో విజయవంతమైనట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ నీట్ పరీక్షలు జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలన్నారు. నీట్ పరీక్ష లీకేజీపై సిఎం చంద్రబాబు స్పందించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరోసారి నీట్ పరీక్ష నిర్వహించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు హిరణ్య, నందు, విద్యార్థి సంఘాల నాయకులు హరూన్‌రషీద్, బ్రహ్మ, సిసింద్రీ, భాస్కర్, అనిల్, ఆకాష్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

శింగనమల : ఎస్ఎఫ్ఐతోపాటు ఐక్య విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ మండలవ్యాప్తంగా విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్ మాట్లాడుతూ 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చిన నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నపత్రాల లీకేజీ వల్ల జీవితాలే నాశనమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి,విష్ణు, గౌతమ్, బాబు, రవి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే గార్లదిన్నె మండల వ్యాప్తంగా నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి మాట్లాడుతూ 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చిన నీట్ స్కాంకు వ్యతిరేకంగా నిర్వహించిన బంద్‌కు సహకరించిన ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, గిరిరాజ్, బబ్లు, ఓబులేసు, హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : నీట్ పరీక్షలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని గాంధీ కూడలిలో 44వ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ముందుగా ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలను నాయకులు బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, నాయకులు బాలాజీ, కష్ణ, ఈశ్వర్, గురు, ధన, వినయ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకటేష్ నాయక్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మహోజ్వల శక్తి 'అల్లూరి'

జయంతి కార్యక్రమాల్లో వక్తలు



అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న ఎస్పీ గౌతమీసాలి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తి మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు అని ఎస్పీ గౌతమీసాలి కొనియాడారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారి గుండెల్లో సింహస్వప్నంగా నిలిచి పోరాటం సాగించారన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి. అందులోనే తన ప్రాణాలను అర్పించారన్నారు. అంతేగాకుండా దేశ ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తి, భారతీయ జాతీయవాదం జ్వాలలను రేకెత్తించిందన్నారు. దేశంలో బ్రిటిష్ పాలకుల దోపిడీ, దురాగతాలు, దమనకాండలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేపట్టేందుకు అనేకమందిని ప్రేరేపించిందని గుర్తుచేశారు. సీతారామరాజు సాగించిన సాయుధ పోరాటం తెలుగు జాతి చరిత్రలో గొప్ప ఘట్టంగా చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయ భాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, అనంతపురం డీఎస్పీ టివివి.ప్రతాప్, ఏఆర్ డీఎస్పీ మునిరాజ, సి.ఐలు దేవానంద్, సుబ్రమణ్యం, ఆర్ఐలు రాముడు, మధు, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, స్వామినాయక్, గోపాల్, పోలీస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, ఎస్పీ సి.సి ఆంజనేయ ప్రసాద్, జిల్లా పోలీస్ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపీ, సూపరింటెండెంట్ ప్రసాద్, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నేతృత్వంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం టిడిపి జిలాల కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు బుగ్గయ్య చౌదరి, ఆదినారాయణ, గాజుల ఆదేన్న, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, టిడిపి నాయకులు దేగల కృష్ణమూర్తి, నెట్టేం బాలకృష్ణ, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక జెఎన్‌టియు పరిపాలన భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఎస్‌వి.సత్యనారాయణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యోద్యంలో బ్రిటిష్ వారిని ధైర్యంగా ఎదిరించిన వ్యక్తి అల్లూరి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు జివి.సుబ్బారెడ్డి, వైశాలి, పద్మ సువర్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, ఎం.రామశేఖరరెడ్డి, కళ్యాణి రాధ, విసి పిఎ డి.శ్రీనివాసులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని గ్రంథాలయంలో అధికారి జయరామ్ ఆధ్వర్యంలో గురువారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భూమిరెడ్డి గారి ట్రస్టు సభ్యులు భూమిరెడ్డి పెదనాగిరెడ్డి, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని గురువారం మండలం కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు వేషధారణలు వేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం.. ఆక్రమణల సంగతేంటి..!

కార్పొరేషన్ అధికారులను ప్రశ్నించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కార్పొరేషన్‌లో పారిశుధ్యం, ఆక్రమణలపై అధికారులు ఏమి చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రశ్నించారు. గురువారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పలు అంశాలపై అధికారులను విభాగాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేషన్ పరిధిలోని పలు వీధుల్లో చెత్తాచెదారాలు గుట్టలుగా పేరుకుపోతున్నా వాటి తరలింపు సక్రమంగా జరగటం లేదని ఎమ్మెల్యే అధికారులకు అక్షింతలు వేశారు. బుధవారం తాను రాంనగర్‌లోని వీధుల్లో పర్యటించినప్పుడు గుట్టలుగా చెత్త చెదారాలు కన్పించాయన్నారు. కాలువల ఆక్రమణ జరిగిందన్నారు. చెత్త తరలింపునకు సంబంధించిన కార్మికులు 409 మంది రిజిస్టర్లో సంతకాలు ఉన్నా క్షేత్రస్థాయిలో 70 మందికి పైగా పనిచేయకుండానే ప్రతినెలా వేతనాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోందన్నారు. కొత్తగా ట్రాక్టర్లు టిప్పర్ తదితర వాహనాలకు టెండర్ నిర్వహించాలని కౌన్సిల్ సమావేశంలో అధికారులకు సూచించానని డిప్యూటీ మేయర్ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఇంత వరకు దీనిపై ఎలాంటి కదలికా లేదన్నారు. ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ స్పందిస్తూ అద్దె ట్రాక్టర్ల టెండర్లపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పారిశుధ్య చర్యలపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా అన్ని పనులను పూర్తి స్థాయిలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఆక్రమణలపై చర్చ రెండు నెలల గడువు కోరిన ఎసిపి

కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై వాడీవేడి చర్చ జరిగింది. ఆక్రమణల పరిస్థితి ఏమిటంటూ ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాలు, కాలువలపై నిర్మాణాలు ఉంటే తక్షణం తొలగించాలంటూ ఎమ్మెల్యే ఆదేశించారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిప్రసాద్ మాట్లాడుతూ నగరంలో 211 అక్రమ భవన నిర్మాణాలను గుర్తించామన్నారు. సెంట్రల్ పార్క్, 54 పార్కు స్థలాల సర్వే రక్షణ గోడలు నిర్మించాలని ఇంజినీరింగ్ విభాగానికి లేఖలు రాశామన్నారు. ఆక్రమణల తొలగింపునకు రెండు నెలల సమయం కావాలంటూ సిటీ ప్లానర్ హరిప్రసాద్ ఎమ్మెల్యేను కోరారు. తొలగింపును పూర్తి స్థాయిలో నిర్వహించాలని, ఇందులో తాను అధికారుల పక్షాన నిలబడతానని ఎమ్మెల్యే తెలిపారు.

వంగవీటి రంగాకు నివాళి

అనంతపురం కలెక్టరేట్ : వంగవీటి రంగా జయంతిని పురస్కరించుకుని గురువారం నగరంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నిర్వాహకులు పుట్లూరు నారాయణస్వామి, ఆకుల రాఘవేంద్ర, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, నాయకులు గాజుల ఆదెన్న, రవికాంత్ రమణ, రమేష్, పగడాల మల్లికార్జున, రాయల్ మధు, దండు శ్రీనివాసులు, సుధాకర్ యాదవ్, సురేష్, భవాని రవి కుమార్, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, లలిత్‌కుమార, జయరాంరెడ్డి, గల్లా హర్ష తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గం రూరల్ : వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ అల్లాబకాష్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు, ఏఎన్ఎంలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో చేపట్టాల్సిన పారిశుధ్య పనులు, డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రంగనాయకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పంటల సాగుకు గ్రీన్ ఎన్జీవో తోడ్పాటు

గుత్తి : మిరప పంటలు సాగు చేసే రైతులకు డిజిటల్ గ్రీన్ ఎన్జీఓ సంస్థ తోడ్పాటును అందిస్తుందని ఉద్యాన అధికారిణి మిత్రవింద మాధవి, సంస్థ ప్రతినిధి యశోధ తెలిపారు. గురువారం పట్టణంలోని డ్వామా కార్యాలయంలో సీఎల్ఆర్సీ భవనంలో డిజిటల్ గ్రీన్ సంస్థ, గుత్తి డివిజన్ పరిధిలోని ఆర్బీకే సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిరప పంట సాగు చేసిన రైతులకు ఐవీఆర్ఎస్ ద్వారా సలహాలు, సూచనలు ఇస్తామన్నారు.

సిటీ స్కాన్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సిటీ స్కాన్ సేవలు గురువారం నుంచి ప్రారంభమైనట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. మూడు రోజుల క్రితం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న 16 స్లాష్ సామర్థ్యం కలిగిన పరికరాన్ని తొలగించి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు దాని స్థానంలో 32 క్లాస్ సామర్థ్యం కలిగిన పరికరాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గురువారం 50 మంది రోగులకు సిటీ స్కాన్ చేసినట్లు చెప్పారు. పరీక్షించిన రోగులకు మూడు నుంచి నాలుగు గంటల వ్యవధిలో రిపోర్టులు అందించామన్నారు. ఈ సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కష్టపడిన వారికి గుర్తింపు : ఎమ్మెల్యే గుమ్మనూరు

ప్రజాశక్తి-పామిడి

పార్టీ అభివృద్ధి, అభ్యర్థుల గెలుపునకు కష్టపడి పని చేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తెలిపారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో 11 గ్రామ పంచాయతీలకు సంబంధించిన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా స్టోర్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మిడ్ డే మీల్స్, యానిమేటర్ల నియామకాల నియామకాల్లో కష్టపడిన వారికే ప్రాధాన్యత ఇచ్చామన్నారు. అనంతరం అనుంపల్లి టిడిపి శ్రేణులు ఎమ్మెల్యేతోపాటు గుమ్మనూరు ఈశ్వర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, ఆర్ఆర్.రమేష్, పత్తి హిమబిందు, లక్ష్మీకాంతమ్మ, ముసలిరెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు అంజీనాయక్, జనసేన మండల అధ్యక్షులు ధను, ఆవుల శివ, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.


నేరాలు ఘోరాలు

భర్తపై భార్య ఫిర్యాదు

పుట్లూరు : కూతురిని ఎత్తుకెళ్లాడని భర్తపై ఓ భార్య ఫిర్యాదు చేసిన ఘటన మండలంలోని తక్కలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఓంకారి శివశంకర్ గతనెల 20వతేదీన తన భార్య స్వాతిలో గొడవ పడ్డాడు. దీంతో కూతురు ప్రశాంతను తనతో తీసుకుని వెళ్లాడు. దీంతో శివశంకర్ భార్య స్వాతి గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ